18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
మంగళవారం | 15 అక్టోబర్ 2024 | పేజీలు 9

## ప్రశాంతంగా ముగిసిన మద్యం లాటరీ : కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జిల్లాలో ప్రభుత్వ నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం దుకాణాలను పారదర్శకంగా ప్రశాంతంగా లాటరీ పద్ధతిలో కేటాయింపు ప్రకియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లాటరీ పద్ధతిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8గంటల ప్రారంభమైన లాటరీ ప్రక్రియను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల కేటాయింపు ప్రక్రియ మధ్యాహ్నం వరకు కొనసాగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శంగా మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు, ఈ ప్రక్రియను పూర్తిగా వీడియో గ్రాఫర్లతో వీడియోగ్రఫి చిత్రీకరించినట్లు తెలిపారు.ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల




సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 104 మద్యం దుకాణాలకు 2,266 మంది టెండర్లుదాఖలు చేయగా, 104 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 104 మందిని ఎంపికచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మద్యం టెండర్లలో సిండికేటర్లదే హవా..!




**అధికార పక్షాలకు సమానంగా ప్రతిపక్షానికి దక్కిన మద్యం దుకాణాలు**

**బినామీ పేర్లతో అధిక దుకాణాలకు ప్రతిపక్ష పార్టీ నాయకుల టెండర్లు**

**ఒక్కొక్క దుకాణానికి పదుల సంఖ్యలో టెండర్లు**

**అధికారంలో ఉండి దుకాణాలను దక్కించుకోలేని కూటమి నాయకులు**

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహించగా ప్రస్తుత కూటమి ప్రభుతో మద్యం విక్రయాలను ప్రైవేటు విక్రయదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంది. ఆ మేరకు టెండర్లను పిలవడం ఆ టెండర్ ద్వారా దుకాణాలను కేటాయించేందుకు లాటరీ పద్ధతిని నిర్వహించడం జరిగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు వారికి మద్యం దుకాణాలను కేటాయించేందుకు వచ్చిన దరఖాస్తుల మేరకు అక్టోబర్ 14వ తేదీని నిర్ణయించి జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్ల సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించారు. గతంలో కని విని ఎరుగని రీతిలో రెండు లక్షల రూపాయలు దరఖాస్తుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 1900 కోట్ల రూపాయలకుపైగా ఆదాయం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా అందిన దరఖాస్తులలో చిత్తూరు జిల్లాకు సంబంధించి ప్రభుత్వం

మిగతా 2లో

### భారీ వర్షాల నేపథ్యంలో
## అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నాం : కలెక్టర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుని మానవ, పశు ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. సమాచార శాఖ, మీడియా, సోషల్ మీడియా తదితర మార్గాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచించగా, తిరుపతి జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ముందస్తుగా జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి అధికారులు వారి పరిధిలోని గ్రామాలలో, పట్టణాలలో పర్యటించి డ్రెయిన్లు ఎక్కడైనా బ్లాక్ అయిన వాటిని క్లియర్‌చేయడం, జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని, కోస్తా తీర ప్రాంతాల్లో మత్స్యకారులను సముద్రంలోకి వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేసి పర్య వేక్షిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు కాలంగి, కండలేరు, కల్యాణి డ్యాం తదితర రిజర్వాయర్‌ల నీటినిలువ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు 25శాతం వరకు మాత్రమే నిండి ఉన్నాయని తెలిపారు. గత 2021 సం. అనుభవాల దృష్ట్యా ఎక్కడ ఎక్కడ వరద ప్రభావితమయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడ ముందస్తు చర్యలు చేపడుతున్నామని, పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉన్నామని వివరించారు. గత మూడు రోజుల నుండి జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నా మని, కోస్తా తీర ప్రాంతాలైన గూడూరు డివిజన్ కోట, చిల్లకూరు, వాకాడు మండలాలు, సూళ్లూరుపేట డివిజన్ నందు తడ తదితర మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టా మని, నిత్యావసర సరుకులు తగినంత అందుబాటులో అన్ని మండలాలలో ఉండేలా చర్యలు తీసుకున్నామని, చెరువులు, కాలువల వెంబడి అధికారులు పర్యటించి కరకట్టలను పరిశీలించారు అని, నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బందీ లేదని ఎలాంటి విపత్తును అయినా ఎదుర్కొనేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలుపుతూ ముఖ్యమంత్రిఆదేశాల మేరకు, మార్గదర్శనం మేరకు ఎప్పటికప్పుడు అన్ని రకాల చర్యలు చేపడతామని తెలిపారు.

## తిరుపతి జిల్లాలో అల్పపీడనం ప్రభావం

**పోలీసులు అప్రమత్తంగా ఉండాలి**

**ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అక్టోబర్ 15 నుండి 18వ తేదీ వరకు తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ముందస్తు సమాచారం ఆధారంగా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అందరికంటే ఎక్కువ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోరకు డైల్ 112/80999 99977 నెంబర్లుకు సమాచారం ఇచ్చి సహాయం పొందగలరని తెలిపారు. జిల్లా ప్రజలకు పోలీసు వారి సూచనలు రైల్వేఅండర్ బ్రిడ్జిల కింద నీళ్ళు ఎక్కువగా ఉన్నప్పుడు ఆ మార్గంలో వెళ్ళ కూడదు, వేరే మార్గాలలో వెళ్ళండి. పాత భవనాలలో ఉండేవాళ్లు వాటిని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. కృంగే స్వభావం ఉన్న నేల, ప్రదేశంలో ఆవాసాలు ఉన్నవారు కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న



ప్రాంతాలలో నివసించేవారు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలని సూచించారు. నాలుగు తుపాన్లు వచ్చే సమయంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించడం వల్ల చాలా వరకు ప్రమాదాలు తప్పుతాయని అన్నారు.

**ఈ పనులు అస్సలు చేయొద్దండి...**

వరద నీళ్లలోకి వెళ్లొద్దు. ప్రవహించే నీళ్లకు పిల్లలను దూరంగా ఉంచండి. వరదనీటిలో నడవకండి లేదా డ్రైవ్ చేయకండి. రెండు అడు గుల లోతున్న వరద నీటిప్రవాహానికి పెద్ద కార్లు కూడా కొట్టుకుపోతాయి. వరదల

మిగతా 2లో

## తిరుపతి జిల్లాలో అల్పపీడనం ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో, విద్యుత్తు అంతరాయాలకు అవకాశం ఉంటుంది. కాబట్టి లిఫ్ట్‌కు బదులు మెట్లను ఉపయోగించండి. సుదీర్ఘ విద్యుత్ అంతరాయాలు ఏర్పడినా, చుట్టూ నీళ్లు వచ్చేసినా లిఫ్ట్‌లలో చిక్కుకుని బయటకు రాలేని పరిస్థితి ఏర్పడొచ్చు. మీరు తడిగా లేదా నీళ్లలో నిలబడి ఉంటే విద్యుత్ పరికరాలను తాకవద్దు.మురుగు కాలువలు, కల్వర్టులు మొదలైన వాటికి దగ్గరగా వెళ్లవద్దు. నీటి లైన్లు / మురుగు నీటి పైపులు దెబ్బ తిని ఉంటే టాయిలెట్ లేదా పంపు నీటిని ఉపయోగించవద్దు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను వెంటనే నమ్మేయవద్దు, వాటిని నిర్ధరించుకున్న తర్వాతే ఏం చేయాలో నిర్ణయించుకోండి. అలాగే సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లను వెంటనే ఫార్వర్డ్ చేయకండి. అవి నిజం కాని పక్షంలో వాటి వల్ల ఇతరులు అనవసరంగా ఆందోళనకు గురవుతారు. వర్షాలు పూర్తిగా తగ్గేవరకు పిల్లలను స్కూళ్లకు పంపకండి.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎస్వీయూ విద్యార్థుల ఎంపిక

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లోని పలు పోస్టులకు నిర్వహించిన ముఖా ముఖి ఎస్వీయూలో ఎంబీఏ కోర్స్ చదువుతున్న 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ నరసయ్య వెల్లడించారు.



ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ మొత్తం 35 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని, 25 మంది షార్ట్ లిస్టు అయ్యారని, 9 మంది ఎంపికైనారని అన్నారు. ముఖాముఖి ఎంపికలో విద్యార్థి యొక్క శారీరక, మానసిక దృఢత్వం, భాషా నైపుణ్యాలను, సబ్జెక్టు నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక చేస్తారని అన్నారు. వీటన్నిటిని విద్యార్థులు తరగతి గదిలో అధ్యాపకుల ద్వారా క్షుణ్ణంగా నేర్చుకొని అవగాహన చేసుకొని, ఔపోసన పట్టాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ కష్టపడి చదివి, నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కాబట్టి విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆచార్య నరసయ్య, అధ్యాపకులు అభినందించారు.

## అగ్ని ప్రమాదంలో లక్ష ఆస్తి నష్టం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక పట్టణంలోని పాతపేట జెండా మరం మసీదు వెనక ఆరిఫ్



అనే వ్యక్తి ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన మేరకు వివరాలు ఇలా పాత పేటలో నివాసముంటున్న ఆరిఫ్ అనే వ్యక్తి ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సంఘటన ప్రాంతానికి చేరుకొని మంటలను ఆర్పి వేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ... ఇంట్లో ఉన్న వాషింగ్ మిషన్ ఫ్యాను, ఫ్రిడ్జ్ బట్టలు, గృహపకరణాలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం ఎలా సంభవించిందో అధికారుల దర్యాప్తులో తెలియాల్సి ఉందన్నారు.

## సచివాలయం ఆర్‌బికే సెంటర్లకు వెళ్లే దారి మూసివేత

### విచారించిన ఎంపీడీఓ

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు ఎంపీడీవో ఖాదర్ బాషా తెలిపిన సమాచారం మేరకు, పలమనేరు రూరల్ మండలం జగమర్ల గ్రామంలో గత వైసిపి ప్రభుత్వం సచివాలయం, ఆర్.బి.కె భవనాలను సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించి ఉన్నారు. దారి సమస్యతో సచివాలయం ఆర్‌బికే సెంటర్లకు వెళ్లే రహదారిని జగమర్ల గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు మూసివేయడంతో గ్రామంలో ఇరు వర్గాలకు మధ్య తీవ్ర వాగ్వాదం ఘర్షణ వాతావరణం నెలందన్నారు. దీంతో సచివాలయం ఆర్‌బికే సెంటర్‌లకు తాళాలు వేశారు. ఉద్యోగులు సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వాదనలను పరిశీలించారు. త్వరలోనే విచారించి సమస్యను సద్దుమణికిస్తామని ఎంపీడీవో తెలిపారు.



# మద్యం టెండర్లలో సిండికేటర్లదే హవా

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించిన 104 దుకాణాలకు సంబంధించి 2266 దరఖాస్తులు అందగా వాటికి సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సంతపేట సమీపంలోని ఆర్‌ఆర్ గార్డెన్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యవేక్షణలో ఎక్సైజ్ శాఖ అధికారులు లాటరీ పద్ధతిని నిర్వహించారు. ఈ లాటరీ ద్వారా ప్రైవేటు దుకాణాలను కేటాయించగా అందులో అధికార పక్షానికి సమానంగా ప్రతిపక్షానికి చెందిన నాయకులకు దుకాణాలు రావడంతో అధికార పక్షానికి చెందిన నాయకులు విస్తు పోతున్నారు. ఇందుకు గల ప్రధాన కారణం ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు సంబంధించి ఆహ్వానించిన దరఖాస్తుల సమయంలోనే ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ప్రతి దుకాణానికి బినామీ పేర్లతో పదుల సంఖ్యలో అవసరమైతే వందల సంఖ్యలో దరఖాస్తులను వేయడంతోపాటు వారికి సహకరించే అధికార పక్ష నాయకులతో కుమ్మక్కై రింగు మాస్టర్లుగా మారి అధిక దుకాణాలను దక్కించుకోవడం జరిగిందని ప్రతిపక్ష పార్టీకి చెందిన కొంతమంది బహిరంగంగా చెబుతుండడం చూసి కూటమి పక్ష నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.. అధికారం తమ వద్ద ఉన్న ఏమి చేయలేని పరిస్థితిలో ఎందుకు ఉండవలసి వచ్చిందో అర్థం కాక తమకు అండగా ఉండే బడా నాయకులను దుమ్మెత్తి పోస్తున్నారు. ఉదాహరణకు సోమవారం జరిగిన లాటరీ పద్ధతిలో ప్రతిపక్షానికి చెందిన చిత్తూరు నియోజకవర్గ ఓ బడా నాయకుడికి సుమారు ఐదు దుకాణాలకు పైగా రావడం అతనితో కుమ్మక్కైన ప్రతిపక్షా నాయకులకు సైతం అతనికి సమానంగా దుకాణాలు లాటరీ పద్ధతిలో రావడం బట్టి చూస్తే వీరందరూ ఏవిధంగా రింగు మాస్టర్లుగా మారి దుకాణాలను దక్కించుకున్నారు ఇట్లే అర్థమవుతుంది. అలాగే కేవలం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని అర్బన్ పరిధిలో 14దుకాణాలలో ప్రతిపక్షానికి సరి సమానంగా దుకాణాలు రావడం చిత్తూరు నియోజకవర్గ కూటమి నాయకులు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వా అరాచకాలను తట్టుకొని పార్టీకి అండగా ఉండి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన తమకు పార్టీ నుండి గాని పార్టీ ఉన్నత నాయకుల నుండి కానీ ఇప్పటివరకు ఏమీ జరగకపోవడం వెనక ఉన్న మతాలాబు ఏమిటో అర్థం కాక మద్యం దుకాణాల కేటాయింపులో సిండికేటర్ల హవా కొనసాగింపుపై పార్టీ అధిష్టానాలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కేవలం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో సైతం ప్రతిపక్ష పార్టీకి చెందిన బడా నాయకులు తమ తడాఖా చూపించడం కూటమి పార్టీలకు చెందిన సామాన్య కార్యకర్త కూడా సహించడం లేదు అనేది మాత్రం అక్షర సత్యం. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మాత్రం అధికార పక్షానికి చెందిన శాసనసభ్యులు కొంతమంది నిజాయితీగా వ్యవహరించి పార్టీ కోసం పనిచేసిన నాయకులకు అండగా ఉండి మద్యం దుకాణాలను వచ్చే విధంగా చూశారని అధిక శాతం మంది ప్రలోభాలకు లొంగి తమ పార్టీకి చెందిన వారికి అన్యాయం చేశారన్న ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి.

# రూ.10లు నాణేలు చట్టపరంగా చెల్లుబాటు

## కెనరా బ్యాంక్ అధికారులు వెల్లడి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రూ.10ల నాణేలు చట్టపరంగా చెల్లుబాటు అవుతాయని, ఈ విషయంపై ప్రజలందరూ అవగాహనతో వ్యవహరించాలని సర్కిల్ హెడ్, జనరల్ మేనేజర్ పాండురంగ మిథంతాయా తెలిపారు. ఈ మేరకు కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ ఆధ్వర్యంలో సోమవారం పది రూపాయల నాణ్యాల ఆమోదంపై అవగాహన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.10ల నాణేలు చట్టపరమైన చెల్లుబాటు గురించిన అపార్థాన్ని తగ్గించడానికి రూ.10 నాణేలపై మరింత విశ్వాసాన్ని పెంపొందించడంలో ప్రచారం నిరూపిస్తు న్నామని తెలిపారు. అవగాహన ప్రచారంలో భాగంగా, కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మొబైల్ కరెన్సీ వ్యాను ను ప్రారంభించారు. అలాగే రూ.10ల నాణేలను వివిధ శాఖలకు చెందిన కెనరా బ్యాంకు కస్టమర్లకు పంపిణీ చేశారు. వినియోగదారులందరూ రూ.10ల నాణేలు వినియోగించా లని కోరారు. అలాగే డిప్యూటీ జనరల్ మేనేజర్ జి ఎన్ మూర్తి, రీజినల్ హెడ్ టి.నాగరాజ రావు కస్టమర్లను సంప్రదించి, రూ.10. నాణేల సర్క్యులేషన్‌పై అవగాహన పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్లు జిఎన్ మూర్తి, రవీందర్ కుమార్ అగర్వాల్, రీజనల్ హెడ్ టి.నాగరాజ రావు పాల్గొన్నారు.




# తొట్టంబేడు మండల ప్రజలు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తొట్టంబేడు మండలం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలు మేరకు తుఫాన్ పట్ల తొట్టంబేడు మండలం ప్రజలు తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని. గ్రామలలో రైతులు వ్యవసాయ పొలంలోకి వెళ్లి చెట్లకింద నిలబడడం. కరెంటు స్తంభాల పక్కన ఉండటం. అదేవిధంగా పొలాల్లోకి వెళ్లినప్పుడు పిడుగులు ఉరుములతో కూడిన వర్షంలో ఉండడం మంచిది కాదని. అదేవిధంగా తెలుగు గంగ కాలువ పొంగి పొర్లుతుండగా పిల్లలును ఇంటి నుంచి వెలుపలకు రానీయకుండా అదుపు చేయడం తదితర కార్యక్రమాలను రైతులు అప్రమత్తంగా ఉండాలని తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు కోరారు. గ్రామాల్లో ఏ విధమైన సంఘటనలు జరిగిన పోలీసు వ్యవస్థ. ఇరిగేషన్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది. రెవెన్యూ సిబ్బంది. ఫైర్ సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామాలలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని, మండల కార్యాలయ సిబ్బంది. ఎంఆర్‌ఓ. ఎండిఓ అధికారులు కూడా అందుబాటులో ఉంటారని కోరారు. ఈ వర్షాభావంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంలో గ్రామ కార్యదర్శులు బ్లీచింగ్ చేయడం. పిహెచ్ సి సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని. సర్పంచులు. ఎంపీటీసీలు. ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.



## ఘనంగా ముప్పాళ్ళ జన్మదిన వేడుకలు

**సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట నియోజక వర్గం దొరవారిసత్రం మండలం యేకాల్లు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజి చెంగాళ్ళమ్మ ట్రస్టుబోర్డు చైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆకుతోట రమేష్ ఆద్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు మేడా సాయి 'దేశం పార్టీ నాయకులు దంతాల రవి 'మైనార్టి నాయకులు యస్.కె.ఆలీబాయ్ శ్రీదర్ శంకరయ్య 'మస్తాన్ అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలకు వాతావరణశాఖ భారీ వర్ష హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 16న బుధవారం శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఇందుకు సంబంధించి 15వ తేది మంగళవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## తిరుమలలో భారీ వర్షం

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో వరుణ దేవుడు మరింత చల్లగా మార్చారు. భక్తులు కొద్దిపాటి ఇబ్బందులకు గురి అయిన ప్రకృతి ఇస్తున్న చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. తిరుమలలో రోడ్లు అన్ని వర్షపు నీటితో నిండి పోయాయి. భారీగా కురిసిన వర్షానికి నాలుగు మాఢ వీదులు జలమయం కాగా స్వామి వారి దర్శనానికి వెళ్ళిన భక్తులు, స్వామి వారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు వర్షానికి తడిచి ముద్దయ్యారు. స్వామి వారి దర్శనం తరువాత వెలుపలకు వచ్చిన భక్తులు తమ వసతి గృహాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అకాల వర్షంతో తిరుమలలో వాతావరణం మరింత చల్లగా ఆహ్లాదకరంగా ఉండడంతో భక్తులు చల్లదనాన్ని ఏంజాయ్ చేశారు.

## భారీ వర్షాలు ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే యస్సివి నాయుడు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి. సత్యవేడు. వెంకటగిరి. సులూరుపేట నియోజవర్గాలు ప్రజలు భారీ వర్షాలకు కురిసే అవకాశముందని బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అక్టోబర్ 14 నుండి 17వతేదీ వరకు నాలుగు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ వారు హెచ్చరికలు జారీ చేశారు. అన్ని రంగాలు ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలు కూడా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్దంగా ఉండాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు యస్సివి నాయుడు అధికారులను, ప్రజలను కోరారు. చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకోవడం కన్నా, ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అని, ప్రభుత్వ అధికారులను, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## రైతులందరూ ఈ పంట నమోదు చేయించండి

**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** ఏర్పేడు మండలం యండి పుత్తూరు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో ఇపంట నమోదు సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించబడినది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా సర్పంచ్ మోహనప్రియ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి గ్రామంలో రైతులు నమోదు చేయించుకున్న ఇపంట నమోదు వివరాలను అందరికీ తెలియజేశారు. సర్పంచ్ మోహనప్రియ మాట్లాడుతూ ప్రతి రైతు కూడ ప్రతి పంటకూ బాధ్యతగా ఇపంటనమోదు చేయించుకోవాలని ఏదైనా విపత్తు సంభవించిన ఇ పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం అందించేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి. గ్రామ తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి ఎక్సైజ్ శాఖ డివిజన్ మద్యం దుకాణాలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఎక్సైజ్‌శాఖ డివిజన్ పరిధిలో 30మద్యం దుకాణాలకు టెండర్ దారులను సోమవారం ఖరారు చేశారు. ఈ దుకాణాలకు 401 మంది దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతి శిల్పారామం వేదికగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా 30 మంది టెండరుదారులను ఖరారు చేశారు. మద్యం దుకాణాలు దారులు పేర్లు ఈ కింది విధంగా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణం పరిధిలో షాపు నెం.55 నుంచి 66వరకు జి.అంకయ్య, ఎన్.మునికృష్ణయ్య, ఎస్.శ్రీకాంత్ రెడ్డి, కే.జయప్రకాష్, ఎమ్మార్ వంశీకృష్ణ, సుధాకర్, ఎం.రవి, శ్రీకాంత్ రెడ్డి, గురువారెడ్డి, హరికృష్ణ, ప్రసాద్ నాయుడు, ప్రసాద్ వరుసగా దక్కించుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని షాపు నెం.67 నుంచి 71 వరకు ఎం.జ్ఞానేష్, పరమేష్, లక్ష్మయ్య, దాశరధినాయుడు, నరేంద్ర బాబు, కేవీబీ పురం మండలంలో షాపు నెం.72 నుంచి 74వరకు యజ్ఞసాయి, నందిఅరుణ్, సురేంద్ర బాబు, తొట్టంబేడు మండలంలో షాపు నెం.75 నుంచి 77 వరకు మోహన్ కుమార్, ప్రసాద్, వాసు నాయుడు, ఏర్పేడు మండలంలో షాపు నెం.78 నుంచి 84 వరకు టి.రమేష్, నాగేశ్వరరావు, పి నాగరాజు నాయుడు, జి సురేష్, కిరణ్ కుమార్, రఘుపతి నాయుడు, వై మనోహర్ నాయుడు వరుసగా టెండర్ దార్లు షాపులు కైవసం చేసుకున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత వహించండి : డీఎంహెచ్ఓ

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రభావతి దేవి జిల్లా లోని వైద్యాధికారులకు సోమవారం తన కార్యాలయం లో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న తుఫాను నేపథ్యంలో వైద్య సిబ్బందికి ఎవ్వరికి మూడు రోజులపాటు సెలవు ఇవ్వడం కుదరదని డిఎంహెచ్వో తెలిపారు. తుఫాను కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని,సీజనల్ వ్యాధులైన డయేరియా, దోమ కాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగు జ్వరాలు పై వైద్యాధికారులు రోజువారి మానిటరింగ్ చేయాలని , లైన్ డిపార్ట్మెంట్స్ అయిన పంచాయతీ రాజ్, ఐసిడిఎస్, ఎడ్యుకేషన్, ఆర్ డబ్ల్యు ఎస్, సెక్రటేరియట్ లతో అనుసంధానమై ప్రతి కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని, ఇంటింటి సర్వే ప్రతిరోజు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని తెలిపారు. ఐడిఎస్ పిఐహెచ్ఐపి క్రింద ఎపిడమిక్స్ అతి సార, డయేరియా వచ్చిన చోట మెడికల్ క్యాంపులు 24 గంటలు, జీరో కేసులు వచ్చేంతవరకు కండక్ట్ చేస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు తెలియజేయాలన్నారు. అత్యవసర సీరియస్ కేస్ అయితే 108లో సిహెచ్సిస్, డిహెచ్ కానీ రెఫర్ చేసి ఎలాంటి డెత్ లు రాకుండా చూడాలన్నారు.ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, ఆర్ఎంపీల నందు జ్వరం కేసులు డేటాను ఫాలోఅప్ చేయాలని తెలిపారు. స్కూల్స్, హాస్టల్స్ నందు వైద్యాధికారులు సిహెచ్ఓలు రోజువారి కార్యచరణతో వాటర్ టెస్టింగ్, మెడికల్ క్యాంపులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాత శిశు సంరక్షణ పై పూర్తి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై, బ్రెస్ట్ ఫీడింగ్ పై, పౌష్టికాహారం, రక్తహీనత పై తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నందు పిహెచ్సి డాక్టర్లు అటెండ్ అయి, ఆరోగ్యశ్రీ కేసులను సిహెచ్సి స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ ద్వారా వారంలో ఒకరోజు చూయించాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ అన్ని సేవలను ఆన్లైన్ అప్డేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్,జార్జ్, రామ్మోహన్ ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచనల మేరకు తుఫాన్ పట్ల గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పొలంలోకి వెళ్లి చెట్లకింద నిలబడడం, కరెంటు స్తంభాల పక్కన ఉండటం, అదేవిధంగా పొలాల్లోకి వెళ్లినప్పుడు పిడుగులు ఉరుములతో కూడిన వర్షంలో ఉండడం మంచిదికాదని, అదే విధంగా తెలుగుగంగ కాలువ పొంగిపొర్లుతుండగా పిల్లలను ఇంటి నుంచి వెలుపలకు రానీయకుండా అదుపు చేయడం తదితర కార్యక్రమాలను రైతులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఏ విధమైన సంఘటనలు జరిగిన పోలీసు వ్యవస్థ, ఇరిగేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఫైర్‌సిబ్బంది అందరూ అందు బాటులో ఉంటారన్నారు. వారు స్పందించకపోతే గ్రామస్థాయి నాయకులకు తెలియజేసిన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటి కప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని, మండల కార్యాలయ సిబ్బంది, ఎంఆర్ఓ, ఎంపీడఓ, అందరూ అధికారులు కూడా అందుబాటులో ఉంటారని మండల స్థాయి అధికారులు ప్రజలను కోరారు. ఈ వర్షాభావంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంలోభించ డంతో గ్రామకార్యదర్శులు బ్లీచింగ్ చేయడం, పిహెచ్ సి సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టడం, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.



## చినుకు పడితే నదిలా శిరసనంబేడు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని శిరసనంబేడు గ్రామంలోని దళిత వాడలో చినుకు పడితే వీధి రోడ్లు నదిలా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.ఎడతేరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు వీధి రోడ్డుపై నిలబడి దర్శమిస్తున్నాయి. ఈ వర్షపు నీటి ఉన్న రోడ్డుపై ఎలా నడవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఎత్తు పల్లాలు లేకుండా వేసిన రోడ్లు వల్ల నీరు ప్రవహించే వీలులేక నడి రోడ్డుపై గృహాల ముందు గృహాల్లోకి నిల్వ చేరి దుర్గందం వెదజల్లుతుంది.వర్షపు నీటి పైన దోమలు అవాసులుగా మారడంతో విష జ్వరాలు, అంటు వ్యాధులు సోకుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శిరసనంబేడు దళిత వాడలో రోడ్లు గతంలో ఎత్తు పల్లాలు చూసుకోకుండా రోడ్లు వేయడం వల్లే నీరు దిగువకు వెళ్లక రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.అంతేకాక గ్రామంలోని ప్రజలు అడుగు తీసి బయట పెట్టలేని స్థితిలో ఉన్నారు. వర్షపు నీటి వల్ల రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రదానంగా వృద్ధులు, చిన్న పిల్లలు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైన మండల స్థాయి అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మండల ప్రజలు భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

**డక్కిలి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 14 నుండి 16వ తేది వరకు భారీ వర్షాలకు ముందస్తు చర్యలు గాను వీఆర్ఓలు అందరు ఎప్పటికప్పుడు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యస్థానం నందు అందుబాటులో ఉండవలసినదిగా ఆదేశించడమైనది. సిబ్బంది అందరికి ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవని తెలిపారు. మూడు రోజులు కురిసే భారీ వర్షాలు కలవని ప్రతి గ్రాములో దండోరా ద్వారా వారి వారి గ్రామ పరిధిలో గల వృద్దులు, గర్భవతులను, చిన్న పిల్లలను మరియు ఆనారోగ్యమువా పడుతున్న వారిని గుర్తించవలెను. పాతబడిన ఇళ్ళులు గుర్తించి అందులోని వారిని ఖాళీ చేయించి సురక్షత ప్రాంతాలకు తరలించుటకు తగు చర్యలు తీసుకొనవలెను. పాతబడిన స్కూల్‌ను, భవనాలు గుర్తించి పిట్టలు అటు వైపు వెళ్ళకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసి మరకత ప్రాంతాలకు తరలించాలి. భారీ వర్షాలకు పుగులు చంకలు పర్యవేక్షించడం. చెరువుల స్థితి గతులను తెలుసుకొనవలెను. భారీ వర్షాలు బరుస్తున్నప్పుడు లోతట్టు ప్రాంతంలో నివసించే కుటుంబాలు ముప్పునకు గురయ్యే అవకాశం ఉన్నదున వారిని ఖాళీ చేయించడం. అంటువ్యాధులు ప్రభంకూడశానిటేషన్ మెటీరియల్ బ్లీచింగ్, పినాయిల్ వంటి వాటిని వర్షాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా చూడడం, అవసరమైన చోట్ల ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలన్నారు.



# జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్త వహించాలి

- నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు
- 15, 16తేదీలలో పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు
- జిల్లా అధికారులు మొదలు గ్రామస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండండి
- మండల స్థాయిలో ఎంపీడీఓలు ,తహసీల్దార్ పోలీసు అధికారులు, లైన్ డిపార్ట్మెంట్స్ సమ న్వయంతో పని చేయండి
- అన్ని పీహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి
- కంట్రోల్ రూమ్ నెంబర్ 9491077356
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా అధికారులను,ఆర్ డి ఓ లు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నందు జిల్లా అధికారుల తో రానున్న మూడు రోజుల్లో వాతావరణ శాఖ వారి హెచ్చరికలతో జిల్లా లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యం లో జిల్లా కేంద్రం లో జిల్లా అధికారులు,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓ లు,తహసిల్దార్ లు ఎంపీడీఓ లతో జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తో కలిసి జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా చెరువుల కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని,వాగులు వంకలు కాలువల వద్ద అప్రమత్తం గా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 15 న నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా లోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు అంగన్వాడీ కేంద్రాలకు ఈ నెల 15,16 వ తేదీలలో సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 9491077356,భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, షిఫ్టుల వారీగా 24ఐ7 సిబ్బంది పని చేయడం జరుగుతుందని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. వ్యవసాయ,ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండాతీసుకోవాల్సిన చర్యలపై దృష్టి రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడా పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు పాడి రైతులకు అవగాహన పెంచాలని వాటి సంరక్షణ బాధ్యత పూర్తిగా చూసుకునేలా తెలియజేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధి కారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట వర్షాలతో చెట్లు విరిగిపడడం తదితర కారణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తు తాయని ఇటువంటి సమస్యలు రాకుండా దీన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల,సచివాలయ,గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందు బాటులో ఉండాలని, ఎటువంటి విపత్తు వచ్చే అవకాశం ఉన్న ముందస్తు గా ఉన్నతాధికారులకు సమాచారం అందించి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్క అధికారి,సిబ్బంది మరింత బాధ్యతతో వారి విధుల ను నిర్వర్తించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీ హెచ్ సి లలో సకాలంలో డాక్టర్లు వైద్య సేవలు అందించేందుకు అందుబాటు లో ఉండాలని అవసరమైన మందులను అందుబాటు లో ఉండాలని ఈ దిశగా పనిచేయాలని డిఎం అండ్ హెచ్ ఓ ను కలెక్టర్ ఆదేశించారు. పూరి గుడిసెలు, శిధిలావస్థ లో ఉన్న ఇండ్లను గుర్తించి అక్కడ వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా సమీపంలోని పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో రెవిన్యూ,పోలీసు ఇతర సంబంధిత లైన్ డిపార్ట్మెంట్స్ అన్ని సమ న్వయం తో పని చేయాలని సమిష్టి గా పనిచేయడం ద్వారా నష్టాలను నివారించ వచ్చునని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా నష్టం జరిగితే అందుకు సంబంధించిన నివేదికలను పూర్తిగా క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రతి శాఖకు చెందిన అధికారి ఎంపీడీఓ లు, తహసిల్దార్లు ముఖ్యమైన రికార్డులను సురక్షితమైన చోట భద్రపరచాలన్నారు. అన్ని మున్సిపాలిటీలలో పంచాయతీలలో గల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, వర్షాల కారణంగా ఈదురు గాలులతో ఫ్లెక్సీ ల వల్ల ప్రమాదం జరగకుండా వెంటనే తొలగించేలా మున్సిపాలిటీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విపత్తు అనంతరం రిలీఫ్ ఆపరేషన్లకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకోండి: జిల్లా ఎస్పీ జిల్లా లో భారీ వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంలో భాగంగా మండలాల వారీగా కల్వర్టులు, బ్రిడ్జిలు, కాజ్ వే ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్ పి సూచించారు. ఈదురు గాలులతో చెట్లు విరిగిపోవడం జరుగు తుందని వీటిని వీటిని తొలగించడానికి అవసరమైన జెసిబిలు, లేబర్ ను, తదితర సామాగ్రిని ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు అందరు అధికారులు సమిష్టిగా పనిచేసే విపత్తును ఎదుర్కోవాల్సిన అవసరం కలదన్నారు. ఈ సమావేశంలో ఎస్ ఈ పి ఆర్ శంకర్ నారాయణ, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు,ఆర్ డ బ్ల్యూ ఎస్ ఎస్ ఈ విజయ్ కుమార్, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రభావతి దేవి, డీఈఓ దేవరాజులు, హౌసింగ్, డ్వామా పీడీ లు పద్మనాభం,రవికుమార్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ,డాక్టర్ ప్రభాకర్, డిపిఓ లక్ష్మి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్ పట్ల అధికారులను అప్రమత్తం చేసిన ఆర్డీఓ



**సూళ్లూరుపేట, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా మారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ముంపు ప్రాంతాల వారికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్డిఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు సోమవారం సులూరుపేట ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఆర్డీవో కిరణ్మయి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురవనన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు సులూరుపేట ఆర్డీవో కార్యాలయం కేంద్రంగా కంట్రోల్ రూమ్‌ను, తాసిల్దార్ కార్యాలయం నందు, మున్సిపల్ కార్యాలయం నందు కూడ కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే 08623-295345 కు సమాచారం అందించాలని తెలియజేశారు. అధికారులకు కేటాయించిన ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపడతారని ముఖ్యంగా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో గ్రామాలలోని నదులు, చెరువులు, వాగులు, నీటి ఉద్రిక్తత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు చారవేయాలని విధులు కేటాయించిన అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని తెలిపామని అన్నారు.

# శాప్‌లో పోలీస్ వ్యవస్థ భాగస్వామ్యం కావాలి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించే కార్యకలాపాల్లో పోలీస్ వ్యవస్థ కూడా భాగస్వామ్యమైతే క్రీడారం గంలో మరిన్ని సత్ఫలితాలను సాధించవచ్చని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడ ి పి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి నైనారు మహేష్ యాదవ్, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ పి ఎల్ సుబ్బారాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడారంగానికి పోలీస్ వ్యవస్థ నుంచి సహకారం అవసరమని, పోలీస్ ఉన్నతాధికారులు సహకరిస్తే మంచి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని రవి నాయుడు కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించి క్రీడలతో ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేయగలమని, శాప్ ఛైర్మన్‌గా మీరు ఆచరిస్తున్న ఆలోచనలకు, చొరవకు పూర్తిస్థాయిలో మా డిపార్ట్‌మెంటు నుంచి సహాయసహకారాలు అందిస్తామని బదులిచ్చారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల

# అనాలోచిత నిర్ణయం సరికాదు

**- మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు జయ గోపాల్**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, దేవస్థానం అధికారుల అనాలోచిత నిర్ణయం తో ఆలయానికి చెడ్డపేరు వస్తుందని ఆలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు జయ గోపాల్ అన్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో భక్తులకు స్వామి దర్శనం కల్పించే తీరుపట్ల ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానం అనుకూలంగా ఉండాలని, భక్తులు ఉదయం నుండి ఎనిమిదిన్నర గంటల వరకు , రాత్రి 8 నుండి ఏకాంత సేవకు ఎక్కువగా పట్టణంలోని ప్రజలు దర్శనానికి వస్తారు, వారిని పిఆర్ఓ ఆఫీస్ (దక్షిణ గాలిగోపురం వద్ద ఉన్న ఈవో ఆఫీస్ పక్కన) ఉంది. పట్టణంలో నుంచి వచ్చిన మహిళలు, ప్రజలు ఆధార్ కార్డు తీసుకెళ్లి అక్కడ ఉండే పిఆర్ఓ కార్యాలయంలో చూపించి అక్కడ వారు ఇచ్చే స్లిప్‌లను తీసకొని మళ్లీ దర్శనానికి వచ్చి కంచు గడప దగ్గర చూపించి అది కూడా సాధారణ క్యూలో పంపించేందుకు ఏర్పాటు చేయడం అనేది చాలా తప్పుడు నిర్ణయం అన్నారు. దీని వల్ల స్థానిక ప్రజల్లో వ్యతిరేకత వసస్తుందని, దేవస్థానికి చెడ్డ పేరు వస్తుంది. ఈ నిర్ణయాన్ని కూడా అధికారులు ఆలోచించాలని, స్థానిక ఎమ్మెల్యే కూడా ఒకసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

# నరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం సుబ్రమణ్య స్వామి ఆలయం సమీపంలో ఉన్న నరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి సందర్భంగా ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కలెక్టర్ ను కలిసిన సైనిక సంక్షేమ శాఖ అధికారి కె.వి రాఘవులు



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ ను ఇటీవల నూతన జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కేవీ రాఘవులు కలిశారు ఈ మేరకు సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలో ఉన్న కలెక్టర్ ను రాఘవులు మర్యాదపూర్వక కలిశారు. ఈ సందర్భంగా జిల్లా లోని మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గిరింపేటలో అద్దె భవనంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం నిర్వహిస్తున్నామని , పాత కలెక్టరేట్లో ఏదైనా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం కేటాయించాలని జిల్లా స్థానిక సంక్షేమ అధికారి కె.వి రాఘవులు కలెక్టర్ ను కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

# పల్లె పండుగతో అభివృద్ధికి బాటలు : ఎమ్మెల్యే గురజాల

- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వాల బాధ్యత
- అభివృద్ధి పనులకు భూమి పూజ



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన "పల్లె పండుగ" కార్యక్రమంతో పల్లెల్లో అభివృద్ధికి బాటలు పరుచుకున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గనిర్దేశంలో "పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, ఆనగల్లు, పాలూరు, ముత్తుకూరు, తాళంబేడు క్రాస్ గ్రామాల్లో పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలలో భాగంగా నిర్వహించి నిర్దేశించిన అభివృద్ధి ఉపాధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. పల్లె ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పల్లెలను తిరిగి అభివృద్ధి బాట పట్టించేందుకు, పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం



ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే "పల్లె పండుగ" పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని..ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామాల అభివృద్ధి తెదేపా, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఐదు గ్రామాల పరిధిలో రూ. 60 లక్షలు విలువైన 9 సిమెంట్ రోడ్ల పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎన్నికల హామీల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సేవలు దీపావళి నుంచి అమలు చేస్తామని తెలిపారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా చిత్తూరు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, రూరల్ మండలం మాజీ ఎంపిపి జయచంద్ర నాయుడు, తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెదేపా నాయకులు జగదీశ్వర్ నాయుడు, రూరల్ మండల అధ్యక్షులు శశికర్ బాబు, కార్యదర్శి రఘు, జిల్లా క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు మేషాక్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజా, ముత్తుకూరు మోహన్, కుమార్, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టండి

- కాలువలను పరిశీలించిన కమిషనర్ నరసింహ ప్రసాద్
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వర్షాల నేపథ్యంలో నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వచేరకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు మార్గ నిర్దేశం చేపట్టారు. మిట్టూరులోని గంగినేని చెరువు మొరవ కాలువను పరిశీలించారు.



కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణలు తొలగించేలా సంబంధిత వ్యక్తులకు సత్వరం నోటీసు జారీ చేయాలని ప్రణాళిక విభాగం అధికారులను ఆదే శించారు. అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కాలువలో ఎక్కడా నీరు నిల్వచేరకుండా సాఫీ గా వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం కమిషనర్ సీఎంటి రోడ్డులో మేజర్ కాలువను పరిశీ లించారు. ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద నిలిచిన నీటిని పరిశీలించారు. సత్వరం మట్టిని తొలగించాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నీవానదిలో ఎక్కడా అడ్డంకులు లేకుండా పూడిక, వ్యర్థాలు తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాలు మరో మూడు రోజులు పాటు కొనసాగుతుందనే హెచ్చరికలు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్న, పెద్ద కాలువల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా. అనిల్ కుమార్ నాయక్, సానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథం, ఎంపీలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# నారాయణాద్రి సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** పేద రోగులకు రాయితీలతో ఆస్టర్ నారాయణాద్రి హాస్పటల్ సేవలు అభినందనీయమని, ప్రజా ఆరోగ్య కార్యక్రమాలకు తాను ఎప్పుడు మద్దతుగా నిలుస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి హాస్పిటల్‌లో రోగులకు ఫస్ట్ ఎయిడ్ కిట్ల, ప్రివిలేజ్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై కొత్త ఫస్ట్ ఎయిడ్ కిట్ల, పంపిణీ ప్రివిలేజ్ కార్డులను ఆవిష్కరించి 250 మంది రోగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ అన్ని రకాల చికిత్సలకు రాయితీలో లభిస్తాయని, ప్రజలందరూ ఈ కార్డులను వినియోగించుకొని మెరుగైన వైద్య సేవలు పొందాలని కోరారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ నిరూపిస్తున్న మెడికల్ క్యాంపులు, వాలంటీర్ సర్వీసులును అభినందించి హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ఆరోగ్యం కోసం అందించే కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సిఓఓ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ తో పాటు పీరియాడిక్ ప్రివెంటివ్ హెల్త్ చెకప్



చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు అని తెలిపారు. ప్రస్తుతం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ అందిస్తున్న ఆరోగ్య చెకప్స్ తక్కువ ధరలలో అందుబాటులో ఉన్నాయి, ప్రజలు వాటిని ఉపయోగించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు 1999/-కె మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షులు అర్కాట్ కృష్ణ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు జగన్నాథం, బెల్లంకొండ సురేష్, సీనియర్ వాకర్లు, హాస్పటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## అధిక వర్షాల నేపథ్యంలో

# నగర పాలక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 98499 07885
- మూడు రెస్క్యూ బృందాలు ఏర్పాటు

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నారు. నగర కమీషనర్ పి. నరసింహ ప్రసాద్ ఇప్పటికే నగరంలో లోతట్టు ప్రాంతాలు, పెద్ద కాలువల్లో ఉన్న ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక



నేపథ్యంలో... నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ లో ముగ్గురు అధికారులు, మరో ముగ్గురు సహాయకులను నియమించి, 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 98499 07885 సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాలు సమయంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలు, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడానికి వీలుగా సహాయక ఇంజనీర్, ఆరోగ్యాధికారి, ఎసీపీ ఆధ్వర్యంలో మూడు రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. వర్షాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర సమయాల్లో తగిన సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అగ్నిమాపక శాఖ అధికారులను కోరారు. కార్యాలయంలోనూ మేనేజర్, ఆర్ఓ, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్, ఆర్ఐలతో కూడిన హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. వార్డు స్థాయిలో వార్డు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# ప్రతిభ గల కళాకారుడు మన సంస్థలో పనిచేయడం గర్వకారణం

## -జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి

**తిరుపతి ప్రెస్ క్లబ్, మేజర్‌న్యూస్:** నాటక రంగంలో ప్రవేశించి,100కు పైగా వివిధ పాత్రలు ధరించి,అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు అందుకున్న బుంగా మల్లికార్జున ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో పనిచేయడం మనందరికీ గర్వకారణమని ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్ రెడ్డి అన్నారు.సోమవారం ఈ మేరకు స్థానిక ఆర్ఎం



కార్యాలయంలో బుంగా మల్లికార్జునకు ఘన సన్మానం చేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.అనంతరం చెంగల్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక అలిపిరి డిపోలో ఎడిసిగా పనిచేస్తున్న బుంగా మల్లికార్జున ఉద్యోగంతో పాటు,నాటక రంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకుని వివిధ రాష్ట్రాలలో లెక్కలేనన్ని నాటక ప్రదర్శనలు ఇస్తూ కళామతల్లి రుణం తీర్చుకోవడం గొప్ప విషయం అన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే కందుకూరి వీరేశలింగం పంతులు అవార్డు, ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు,టీటీడీ వారిచే బంగారు గరుడ అవార్డు, నంది అవార్డు, కర్ణాటక ప్రభుత్వంచే బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు,తెలంగాణ ప్రభుత్వంచే భారత కళారత్న అవార్డు, పాండిచ్చేరి ప్రభుత్వంచే భారత ప్రతిభారత్న అవార్డుతో పాటు డాక్టరేట్, తాజాగా ఈ నెల 2న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో మహాత్మా గాంధీ ఎక్సలెన్సీ అవార్డు అందుకోవడం మన ఆర్టీసీ సంస్థకే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్టిసి జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ బుంగా మల్లికార్జునను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మస్తాన్, గుర్నాథం, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో తరగతుల నిర్వహణ!

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని జిల్లా అధికార యంత్రాంగం ముప్పు ప్రకటించి పెద్ద ఎత్తున ముందస్తు సహాయక చర్యలను చేపడుతోంది. ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు తిరుపతి జిల్లాలో సోమవారం జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సెలవు ప్రకటించారు. అయితే శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేస్తూ సోమవారం తరగతులు నిర్వహించారు. దీంతో విద్యార్థులు వర్షంలో తడుస్తూ స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ముప్పు హెచ్చరికల నేపథ్యంలో సైతం ప్రైవేటు స్కూళ్లలో తరగతుల నిర్వహించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భద్రతపై బాధ్యత లేదా అంటూ విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చుట్టు గురవయ్య, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు జాకీర్ లు సోమవారం పలు ప్రయివేట్ స్కూళ్ల వద్దకు వెళ్లి తరగతులు నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో కొన్ని స్కూళ్లలో విద్యార్థులను ఇళ్లకు పంపి వేయగా, పలు పాఠశాలలు మొండిగా తరగతులు నిర్వహించాయి. వీటిపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్చరీ క్రీడాకారుడుకు శాప్ ఛైర్మన్ అభినందన

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ఇటీవల జరిగిన ఏషియన్ యూత్ ఆర్చెరీ ఛాంపియన్‌షిప్(విలువిద్య) పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నంను ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. ఈ మేరకు సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల లోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో శాప్ ఛైర్మన్ ను మణిరత్నం కలిశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారుడు శాప్ ఛైర్మన్ ప్రశంశించారు. ఏషియన్ యూత్ ఆర్చెరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 19 దేశాలకుపైగా తలపడగా భారత జట్టు తరుపున గోల్డ్ మెడల్ లభించిందని, అలాగే వ్యక్తిగత విభాగంలోనూ గోల్డ్ మెడల్ సాధించినట్లు క్రీడాకారుడు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ శాప్ ద్వారా తన సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలంటూ క్రీడాకారుడికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డీఎస్డీఓ సయ్యద్ బాషా పాల్గొన్నారు.



## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రత్తంగా ఉండాలి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తుఫాన్‌ప్రభావంపట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రత్తంగా ఉండాలని సచివాలయం సిబ్బంది సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు జి విజయ్ కుమార్ నాయుడు ఆదేశాలు మేరకు తుఫాన్ ప్రభావంపై తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల ఎంఎం వాడాలో ప్రజలకు సచివాలయం సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, 19 వవార్డు ఇన్చార్జి గోపీనాథ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మకు భరత్ రెడ్డి మొక్కులు చెల్లింపు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని కొండరాజుపల్లెలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయంలో ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం చల్లగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని వేడుకున్నారు. మాతమ్మ ఆలయంలో మహాకుంభాభిషేకం పురస్కరించుకుని కలవగుంట భరత్ రెడ్డి సారె సమర్పించారు. సారె తీసుకెళ్లిన భరత్ రెడ్డికి కొండరాజులపల్లె వాసులు మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సాంప్రదాయాలతో అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందశారు. మాతమ్మ ఆలయ నిర్మాణానికి భారీ విరాళం అందించిన కలవగుంట భరత్ రెడ్డిని ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించి కృతజ్ఞతలు తెలియచేశారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తిగా ఉంటుందని ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్ నాయుడు, వెంకటరామయ్య, వెంకటయ్య, హరి నాయుడు, పరుశు రాం, రాము, నవీన్, సతీష్, గోపి, పవన్, రాజేష్ ,శరత్, శ్రీను,రాము, గ్రామస్తులు, భరత్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ కొండమల్లీ శ్వర స్వామి సన్నిధిలో తులాభారం



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలం లోని మాంబేడు పంచాయితీ డి ఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండమల్లీ శ్వర స్వామి సన్నిధిలో భక్తులు సోమవారం తులాభారం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులు తులాభారంతో తమమొక్కులను చెల్లించుకున్నారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు

**చిల్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని తిక్క వరం గ్రామాలో మల్లి, అంకమ్మ మామిడి తోట లో గత నెలలో జడల వెంకటేశ్వర్లును మానికల అంకయ్య అనే వ్యక్తి హత్య చేసి పూడ్చి పెట్టాడు. కాగా సోమవారం నిందితుడు మానికల అంకయ్యను పోలీసులు అరెస్టు చేశారు.



## ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పెద్దపంజాణి పెద్దపంజాణి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు, రేపు రెండు రోజులపాటు పెద్దపంజాణి మండలంలోని గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ మరియు పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీ తెలిపారు. డిపిఆర్సి తరపున నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పరిపాలనా కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి శిక్షణ పొందిన ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే బొజ్జల నిర్ణయాలు ప్రజలకు ఉపయోగం

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణంలో నిండిపోయిన మురికి కాలువలో ఒక ప్లాన్ ప్రకారం శ్రీకాళహస్తి పట్టణ




మున్సిపాలిటీ శాఖ ద్వారా శుభ్రం చేయడం. పూడిక తీయడం జరిగింది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో పూడిక తీయడం వంటి నిర్ణయాలకు వర్షపు నీరు ఫ్రీగా కాల్వలోకి ప్రవేశిస్తూ ఉన్నాయి. గత ఐదేళ్ల నుంచి పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. దీంతో ఎమ్మెల్యేగా గెలిచిన బొజ్జల సుధీర్ రెడ్డి సుమారు 50 లక్షలు రూపాయలు వెచ్చించి డ్రైనేజీ కాల్వల్లో పేరుకు పోయిన చెత్త, సిల్ట్ యుద్ధప్రాతిపదికన తొలించేందుకు చర్యలు తీసుకున్నారు. కురుస్తున్న వర్షాలకు పట్టణంలో ఎక్కడా వర్షపు నీరు ఆగకుండా సజావుగా చెంబేడు కాల్వకు చేరుతోంది. ఏ నివాసానికి వర్షపు నీరు ఇబ్బంది కల్గించకపోవడంతో ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఎమ్మెల్యే తీసుకుంటున్న ప్రతీ చర్య ప్రజాపయోగంగా మారుతొందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డిఎస్పీ

**పెళ్లకూరు, మేజర్ న్యూస్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు మండల ప్రజలను కోరారు.మండలంలోని కలవకూరు స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద వరద ప్రహవాన్ని అయన పరశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని రాబోయే రెండు రోజులు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని తెలిపారు కూలిపోయే సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు నివాసం ఉండరాదు అన్నారు. పరివాహ ప్రాంతాల్లో నీటిలోకి ఎవరు వెళ్లొద్దని తెలిపారు. మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫర్మర్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్ కు, అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేస్తే సహాయాన్ని



అందిస్తారని,పోలీసులకి సహకరించాలన్నారు. చెరువులకు, కుంటలకు దూరంగా ఉండాలని తెలిపారు.అయన వెంట స్థానిక ఎస్సై కె నాగరాజు ఉన్నారు.



## సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరం మండలంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం 74 లక్షలుతో సిమెంట్ రోడ్ నిర్మాణానికి భూమి పూజను గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ థామస్ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేనే అభివృద్ధి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి మండల అభివృద్ధి కృషి చేస్తుందన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. అనూరు పంచాయతీ అల్లాగుంట, శెట్టిగుంట గిరిజన కాలనీ కాలని మరియు పద్మసరస్సు గ్రామాలలో రు.74 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణము పనులకు శిలాఫలకాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యతలు. యుగంధర్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చంగల్రా యాదవ్, సర్పంచులు, ఎంపీడీవో చంద్రమౌళి, తాసిల్దార్ భాగమతి, సచివాలయ సిబ్బంది మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

**తడ, మేజర్‌న్యూస్:** మండలంలోని తడ మాంబట్ సెజ్ లో ఉన్న అపాచీ షూ కంపెనీలో నీ "డి" ప్లాంట్ నందు ఈ నెల 11 వ తేదీన గొంజి వనిజ అను కార్మికురాలని



అదే కంపెనీలో పనిచేస్తున్న మీ జూరు సురేష్ తోటి కార్మికులు అందరూ చూస్తుండగానే మధ్యాహ్నం అతి దారుణంగా హత్య చేసిన ఘటన అందరికి తెలిసింది. హత్య చేసిన మిజూరు సురేష్ ను నాయుడు పేట డిఎస్పి జి చెంచు బాబు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సీఐ ఎం మురళీకృష్ణ,తడ ఎస్సై కి కొండప్ప నాయుడు, సిబ్బంది సహకారంతో నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాలు మేరకు చిట్టమూరు మండలం కుమ్మరపాలెం గ్రామానికి చెందిన మిజూరు సురేష్ 22 సం అదే గ్రామానికి చెందిన గొంజీ వనజ ఎదురింటిలో నివాసం ఉంటున్నట్లు ఆ క్రమంలో ముద్దాయి మృతురాలిని ఎలాగైనా లొంగదీసుకుని తన కామవంచ తీర్చుకోవాలని గత ఐదు సంవత్సరాలుగా ప్రయత్నిస్తూ వెంటపడుతున్నట్లు అందుకు మృతురాలు ఒప్పుకోకపోవడంతో ఆమె తన భర్తకు చెప్పినట్లు అయినప్పటికీ ముద్దాయి మృతురాలు వెంటపడి వేధిస్తుండడంతో 2019లో ఒకసారి 2021 లో ఒకసారి మృతురాలు ముద్దాయిపై చిట్టమూరు పోలీస్ స్టేషన్లో కేసు పెట్టినట్లు ఆ తర్వాత మృతురాలు అపాచీ కంపెనీలో పనిచేస్తుండగా ఆమెను లొంగదీసుకోవాలని ముద్దాయి అపాచీ కంపెనీలో చేరి ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం క్యాంటీన్ దగ్గర ఆమెను తన కోరిక తీర్చమని వేదించగా వెంటనే మృతురాలు ఆమె భర్తకు చెప్పి మందలించడంతో మృతురాలి పై కక్ష కట్టి ఆమెను చంపేయాలని నిర్ణయించుకొని షూ కట్ చేసే కత్తెరను తీసుకొని ఆమె పనిచేసే ప్లాంట్ వద్దకు వెళ్లి కత్తెరతో మెడపై భుజం మీద వీపుపై పొడిచి తీవ్రంగా గాయపరిచి అందరూ చూస్తుండగా పారిపోయినట్లు ఆ తర్వాత అమృతరాలు చనిపోయినట్లు తెలుసుకొని తప్పించుకొని తిరుగుతున్నట్లు ముద్దాయి విచారణలో అంగీకరించారు. పోలీసులు అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచగా మెజిస్ట్రేట్ ముద్దాయికి రిమాండ్ విధించి జైలుకు పంపారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట సీఐ ఎం మురళీకృష్ణ కు తడ ఎస్సై కి కొండప్ప నాయుడుకి, పోలీస్ సిబ్బందిని అభినందించి రివార్డుకు ఉన్నతాధికారులకి డిఎస్పి ప్రతిపాదనలు పంపారు.

# తిరుమలకు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## అధికారులతో టీటీడీ ఈఓ జె.శ్యామల రావు



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుపతికి భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అడిషనల్ ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ 48గంటల్లో తిరుపతిలో భారీ నుండి అతి భారీవర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని కోరారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రణాళిక బాగుందనీ, మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఈఓ స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈఓ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలనీ, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్తు అంతరాయ పరిస్థితిల్లో జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐటీ విభాగం భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వైద్య శాఖ అంబులెన్సులను అందుబాటులో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలనీ, ఘాట్ రోడ్డులలో జేసీబీ, ట్రక్కులు, ట్రాక్టర్లు తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే అగ్ని మాపక సిబ్బంది వేగంగా స్పందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజాసంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, టీటీడీ సోషియల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్యనారాయణ, ఇతర విభాగాధిపతులు, జిల్లా పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నూతన మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పూర్తి

## జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లాలో ప్రభుత్వ నూతన మద్యంపాలసీ మద్యం షాపుల టెండర్లకు సంబంధించిన ఓపెన్ లాటరీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుండి తిరుచానూరు శిల్పారామం ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలిసి ప్రారంభించారు. మొత్తం 227 షాపులకు 3920 దరఖాస్తులు అందడం జరిగిందని వాటికి సంబంధించిన లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. సదరు ప్రక్రియ 227 మద్యం షాపులకు మధ్యాహ్నం వరకు పూర్తి అయిందని తెలిపారు.

లాటరీలో విజేతలుగా మద్యం షాపు దక్కించుకున్న వారు అక్టోబర్ 16 నుండి మద్యం షాపులను ప్రారంభించాల్సి ఉంటుందని, రేపు మద్యం డిపో నుండి స్టాక్‌ను తీసుకెళ్లాల్సి ఉంటుందని సంబంధిత ఫీజును ఆరు విడతలుగా చెల్లించవచ్చని తెలిపారు. లాటరీ ప్రక్రియ జరుగుతున్న ఫంక్షన్ హాల్ నందు లక్కీ విజేతగా మద్యం షాప్ దక్కించుకున్న వారు చలాన క్యాష్ డిపాజిట్ చేయుట కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు కౌంటర్లు ఏర్పాటు చేశారని పలువురు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జెసి వారి సహకారంతో అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను చక్కగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మద్యం షాపుల టెండర్ల ద్వారా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖకు సుమారు 78.40 కోట్లు రూపాయల రెవెన్యూ సమకూరిందని తెలిపారు. మద్యం దుకాణాలు ఈనెల 16 నుండి ప్రారంభించాలని, ఉదయం 10 గం.ల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మద్యం దుకాణాల లైసెన్స్ 2024 నుండి 30సెప్టెంబర్ 2026 వరకు చెల్లుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఊహాశ్రీ, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన సబ్ రిజిస్ట్రార్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం ఓ ప్రైవేట్ కార్యాలయంలో లోతట్టు ప్రాంతాల గురించి పార్టీ కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని స్టేట్ సబ్ రిజిస్టర్ ప్రెసిడెంట్ ప్రస్తుత చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కొండారెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే పేరుతో మామూలు వసూళ్లు చేసేవారు. అమాయకమైన ప్రజలను హింసించి మామూలు పేరుతో వసూలు చేయడం తప్పని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని, నా పేరుతో ఏటువంటి మామూలు వసూళ్లకు పాల్పడరాదని, నా పేరు చెప్పి ఎవరైనా వచ్చిన మీ విధులకు లోబడే పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా మైన్స్ ఏడి

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం, రఘునాథ్ రిసార్ట్స్, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని జిల్లా మైన్స్ ఏడి బాలాజీ నాయక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఎమ్మెల్యేతో చంద్రగిరి నియోజకవర్గంలోని పలు విషయాలపై చర్చించడం జరిగింది.



# తుఫాన్ వల్ల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

## కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడుతుండడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మురుగునీటి కాలువలు, ముఖ్యంగా పేరూరు చెరువు నుండి నీరు వచ్చే ప్రాంతాలను, నగరంలో కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు వెళ్లే ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలైన కోరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా సజావుగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పేరూరు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు నగరంలోని ఎక్కువ రావడంతో నీరు నిలిచిపోతున్నాయని గతంలో జరిగిన సంఘటనలను అధికారులు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ కపిలతీర్థం, మాల్వాడి గుండం ప్రధాన కాలువలతో పాటు పలు ప్రాంతాల్లో కాలువలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు తొలగింపుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు మీ ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాన్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను సర్వే చేసి అక్రమనిర్మాణాలు ఐతే తొలగించాలని అధికారులను ఆదేశించారు. గత నెలలోనే ప్రధాన కాలువలను శుభ్రం చేయడం వలన కొంత మేరకు నీరు సజావుగా వెళుతున్నాయని, కాలువల్లో చెత్త లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలన్నారు. హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయం చేసుకుని అన్ని పనులు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా తెల్లవారుజాము నుండే జేసిబి లు, ట్రిప్పర్లతో కాలువల్లో చెత్త తొలగించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్.ఈ. శివారెడ్డి, అర్బన్ , రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజులు నాయక్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సి.పి.ఓ. దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మహేష్, రమణ, లలిత, ఏ.సి.పి.లు రమణ, బాలాజీ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని
కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.

చంద్రగిరి నియోజకవర్గం :
1.చంద్రగిరి, 2.పాకాల, 3.చిన్న గొట్టికల్లు,
4.ఎర్రవారి పాలెం

వెంకటగిరి నియోజకవర్గం :
1. బాలాయపల్లి

సత్యవేడు నియోజకవర్గం :
1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం,
4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

కె.సురేష్‌బాబు
( బ్రాంచ్ మేనేజర్)
ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మినారాయణ
(రీజనల్ మేనేజర్)
ఫోన్ నెంబర్: 6301107116

## టిడిపి నాయకుడు సోమశేఖర్ నాయుడు జన్మదిన వేడుకలు

**పలమనేరు మేజర్ న్యూస్**



మండలంలోని అన్నదాన ధర్మకర్త డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్ కార్యాలయంలో సోమవారం సాయంకాలం టిడిపి నాయకుడు యు సోమశేఖర్ నాయుడు జన్మదిన వేడుకలను వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయనకు సెల్వ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జయశంకర్, డాక్టర్ జనార్ధన్, పూల చేతు, దైవప్రసాద్, చెంచు రెడ్డి, బాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్లలో విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలి



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024 విద్యా సంవత్సరానికిగాను పీజీ కోర్సులో వివిధ కోర్సులలో చేరేందుకు అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా అనివార్య కారణాలవల్ల విద్యార్థులు పిజిసెట్ పరీక్ష రాయని వారికి కూడా అవకాశం కల్పించి స్పాట్ అడ్మిషన్లలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం మాధవకృష్ణ డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకున్న అనైతిక, అసాంఘిక నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని విశ్వవిద్యాలయాల్లో ఒకేసారి పీజీ సెట్ ఎంట్రెన్స్ నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు, నిరుపేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. గతంలో ఉన్నటువంటి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమ్చంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ఖర్చులు తగ్గించాలని ఉద్దేశంతో అడ్మిషన్ల సంఖ్యను పూర్తిగా తగ్గించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉన్నత విద్య అభ్యసించేందుకు నిరుపేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతమైన కర్నూలు, కడప, అనంతపూర్, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని విద్యార్థులు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను చదివి తమ జీవితానికి ఒక సార్థకత తీసుకురావాలని ఆలోచిస్తారని అన్నారు. ఇటువంటి ఉద్దేశంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యాప్త ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం విద్యార్థులు వచ్చి ఇక్కడ చేరడం ద్వారా ఇక్కడ ఉన్నటువంటి నిరుపేద విద్యార్థులు ఎస్వీయూలో చదవాలని ఆశ నిరాశగా మిగులుతుందన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాలకు పీజీ ప్రవేశ పరీక్షను నిర్వహించే అవకాశం కల్పించి ఉన్నత విద్యలో రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లలో కూడా ఉన్నత విద్యాశాఖ ఒక బలమైన నిర్ణయాన్ని తీసుకొని పీజీసెట్ పరీక్ష రాయని విద్యార్థులకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలి

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** మండలలో సముదాయం వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయ ప్రభుత్వ కార్యాలయాలు కనిపించక పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలోనూ నిర్వహించి మురికి కాలువలు రోడ్లు త్రాగునీటి ట్యాంక్ క్లోరినేషన్ చేయడం పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగింది అయితే మండల కాంప్లెక్స్ లో మాత్రం దీనికి భిన్నంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ కార్యాలయం వద్ద శుభ్రం చేసేవారు అయితే అటువంటిది కార్వేటినగరం మండలంలో చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలు వద్ద పిచ్చి మొక్కల తొలగించి ప్రభుత్వ కార్యాలయాలు కనిపించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. చెట్లు పెరిగిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



# వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వయిరీ కి ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం

### - టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్



**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వయిరీ కి ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇందుకు సంబంధించిన అధికారులు రాజకీయ నాయకుల పై చర్యలు చేపట్టనుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూగత వైకాపా పాలనలో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 360 ఉద్యోగాలు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆఫీస్ అపార్డినేట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఉద్యోగాలను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్ద ఎత్తున నగదు తీసుకొని భర్తీ చేయడం జరిగిందని అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ఒత్తిడి మేరకు అప్పటి జిల్లా అధికార యంత్రాంగం నిరుద్యోగుల నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు అమ్ముకోవడం జరిగిందని, అర్హులైనటువంటి అభ్యర్థులను పక్కనపెట్టి కనీసం దరఖాస్తు కూడా చేసుకొనటువంటి వారికి, వైసీపీ ఎమ్మెల్యేల సిఫార్సు ఉన్నటువంటి వారికి ఉద్యోగాలు కట్టబెట్టడం జరిగిందని,. దీనిపైన అప్పటి ఉద్యోగ సంఘాలు, అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన కూడా వ్యక్తం చేయడం జరిగింది. కానీ నిరుద్యోగుల యొక్క మొరను అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కి ఫిర్యాదులు కూడా చేయడం జరిగింది. కానీ అప్పటి ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత, తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన ఫిర్యాదు ఫలితంగా ఈరోజు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకి ఆదేశించడం జరిగిందని,ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కూడా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తాకీదులు ఇవ్వడం జరిగిందని,.ఎన్ని ఉద్యోగాలు భర్తీ నోటిఫికేషన్ విడుదల చేశారు, ఎన్ని దరఖాస్తులు వచ్చింది, నియామకానికి అవలంబించిన నియమ నిబంధనలేమిటి, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ పాటించారా లేదా అంటూ పలు ప్రశ్నావళిని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు లేవదీశారు. ఈ మేరకు సెప్టెంబర్ 6వ తేదీన విజిలెన్స్ అధికారులు విచారణకి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దీనితో పెద్ద ఎత్తున అధికారులలో గుబులు బయలుదేరింది. విజిలెన్స్ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలపైన చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.టిడిపి ప్రభుత్వం ఎప్పుడు కూడా నిరుద్యోగుల పక్షాన నిలబడుతుందని తెలియజేశారు. ఎవరైతే వైసిపి నాయకుల డబ్బులు కి అమ్ముడుపోయారో! ఉద్యోగాలు అమ్ముకున్న అధికారులలో గుబులు బయలుదేరింది. ఈ యొక్క విచారణకి నిరుద్యోగులు అందరూ కూడా సహకరించాలని, దోషులకి కఠినంగా శిక్ష పడాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో లో టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, తవణంపల్లి ఎస్సీ సెల్ నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డుకు భూమి పూజ - తెలుగుదేశం నేత రెడ్డి వారి గురువారెడ్డి

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** ఏర్పేడు మండలం పల్లం గ్రామపంచాయతీలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 13 326 గ్రామపంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. నాయకత్వంలో పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ఒకేసారి రాష్ట్రంలో 13, 326 గ్రామ్ పంచాయతీల్లో ఎన్ ఆర్ జి ఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు 4500 కోట్లతో 3000 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు 500 కిలోమీటర్లు తారు రోడ్డులు. సిమెంట్ డ్రైన్లు రాష్ట్రంలో ప్రజలకు అవసరమైనటువంటి అన్ని కార్యక్రమాలను అభివృద్ధికి పెద్దపీట వేసే విధంగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో అమలు చేయడం గర్వకారణం అన్నారు. గతంలో 2014 నుండి 19 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో లోకేష్ మంత్రి సారధ్యంలో ఎన్ ఆర్ జి ఎస్ నిధులు ద్వారా 25 వేలకు కిలోమీటర్లు సిసి రోడ్లు వేసిన ఘనత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడుకి లోకేష్ కి దక్కుతుంది అని అన్నారు. అదేవిధంగా మాజీ శాసనసభ్యులు మంత్రి గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వందలాది కిలోమీటర్లు సిసి రోడ్లను నిర్మించింది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు గత 19. 24 మధ్య ప్రభుత్వంలో ఉన్న వైసిపి పార్టీ గ్రామాల్లో అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది దానికి నిదర్శనమే ఎన్ఆర్ జి ఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కూడా నిర్వీర్యం చేశారు. స్థానిక సంస్థలకు వచ్చినటువంటి ఎనిమిది వేల కోట్ల రూపాయలు నిధులను పక్కదారి పట్టించి తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి వారి శాసనసభ్యులు అని ఈరోజు ప్రజలందరికీ గుర్తు చేస్తున్నామన్నారు గతంలో 2004 వరకు ఉమ్మడి రాష్ట్రంలో పరిపాలన సాగించిన చంద్రబాబు నాయుడు గారు జన్మభూమి స్ఫూర్తిదాతగా ఉండి పేద ప్రజల కష్టాలు నష్టాలు తెలుసుకోవడం కోసం అధికారులు నాయకులను మీ వద్దకే పంపి మీ యొక్క అభివృద్ధికి సంక్షేమం కోసం పాటుపడ్డటువంటి అభివృద్ధి సంక్షేమ ప్రభుత్వాన్ని నడిపిన నాయకుడు చంద్రబాబునాయుడు గారు అన్నారు అటువంటి చంద్రబాబునాయుడు గారు మీ అందరి ఆశీస్సులతో కూటమి



ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి రావడంతో ప్రజలకు కావలసినటువంటి పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అభివృద్ధిని అందించే దాంట్లో భాగంగా ఒకేరోజు నాయకులు అధికారులు మీ వద్దకే పంపి 13 326 గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు పెట్టి మీకు కావలసినటువంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాలను మీ ద్వారా గుర్తించి ఆమోదించినటువంటి ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని అందించేటటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అని అన్నారు అదేవిధంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా పని చేసేటటువంటి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారు సారధ్యంలో కూటమీ ప్రభుత్వం ముందుకు పోతున్నదని గురవారెడ్డి అన్నారు పేద ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ఆశీర్వదించాల్సిన బాధ్యత ప్రజలుపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి. మండల పార్టీ అధ్యక్షులు నైనర్ పున్నారావు. గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి. ఎంపీడీవో సౌభాగ్యమ్మ. ఎపిఓ. మండల స్థాయి అధికారులు. సచివాలయ్యం సిబ్బంది. పార్టీ యువ నాయకులు రాజా. మునిరెడ్డి. తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఫోటో పల్లె కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు